ఆ రోజు పిల్లలు కాలేజీలో లాబ్‌సౌకర్యాలు సరిగాలేవని సమ్మె చేశారు. క్లాసులు లేకపోవటంతో అరుణ లైబ్రరీలో కూచుని చదువుకుంటోంది.

"అరుణగారూ" అంటూ మెల్లగా పిల్చాడు కేశవరావు.

"రండి. కూచోండి" - ఎదురుగావున్న కుర్చీ చూపించింది అరుణ.

"మీతో వొకవిషయం మాట్లాడాలని వచ్చానండి."

"మీరు చెప్పకుండానే నాకా సంగతి తెలుసండీ. విషయమేమీలేకుండా వుట్టి కబుర్లకోసం మీరెప్పుడూ రారు". అంది నవ్వుతూ. కేశవరావూ నవ్వాడు.

"చెప్పండి."

"పత్రిక ఎలా వుంటోందండి."

"వెలుగు లాగానే వుంటోంది. ఎన్ని విషయాలను వెలుగులోకి తెస్తోందో. సేల్స్ యెలా వున్నాయండి?"

"ఫరవాలేదండి - ఇంకో నాలుగు నెలల్లో సంవత్సరం పూర్తవుతుంది. ఇక ఆ తర్వాత పత్రిక తన కాళ్ళమీద తాను నిలబడగలుగుతుంది."

కాసేపు మౌనం తర్వాత కేశవరావు అన్నాడు.

"మీరు పత్రికకు కేవలం చందాదారుగానే వుండటం నాకు బాగోలేదండి. పత్రికకు మీరింకా సహాయం చెయ్యాలి."

"ఏం చెయ్యాలండి-" ఆశ్చర్యంగా అడిగింది అరుణ.

"పత్రికలో యే విషయాల గురించి రాయాలో, ఆ విషయాలు యెట్లా సేకరించాలో, యెట్లా వొకరూపానికి తేవాలో యివన్నీ మేం పదిహేనుమందిమి కలిసి ఆలోచిస్తున్నాం. మీరు కూడా మాలో చేరితే -"

"నేనేం చెయ్యగలనండి -" మొహమాటంగా అంది అరుణ.

"మీరు చాలా చెయ్యగలరు. ఈ సారి ఎలక్ట్రానిక్ పరిశ్రమలో పనిచేసే స్త్రీల గురించి పత్రిక తీయాలనుకుంటున్నాం. ఆ ఆడవాళ్ళను ఆడవాళ్ళే యింటర్వ్యూ చేస్తే బాగుంటుంది. వాళ్ళు ఫ్రీగా మాట్లాడగలుగుతారు. మా పదిహేనుమందిలో యిద్దరే అమ్మాయిలున్నారు. వాళ్ళు స్టూడెంట్సు. మీరుకూడా వాళ్ళతో కలిసి వెళితే చాలా ప్రయోజనం వుంటుంది."

కేశవరావు అరుణకు పని వొప్పజెప్పినట్లు ఫీలై నిశ్చింతగా కూచున్నాడు.

అరుణకు యేం చెప్పాలో తోచలేదు. "నేనేం చెయ్యగలనండి" అంది మళ్ళీ మొహమాటంగా-

"రేపు సాయంత్రం అందరం కలుద్దామండి. ఏం చెయ్యాలో యెలా చెయ్యాలో మాట్లాడుకుందాం" అన్నాడు కేశవరావు.

"ఎక్కడ?"

"ఒక ఫ్రెండింట్లో. నేను మిమ్మల్ని తీసుకెళ్తాను. రేపు సాయంత్రం కాలేజీ అవగానే యిద్దరం కలిసి వెళదాం. మీరు రావటం చాలా అవసరమండీ-"

"నాకు కుదరదేమోనండి" అరుణ యిబ్బందిగా అంది

"ప్రయత్నించండి. పోనీ వొకసారి రండి. మీకు మరీ యిబ్బందిగా అనిపిస్తే మానేద్దురుగాని."

అరుణ యింక బతిమాలించుకున్నట్లు వుంటుందని వొప్పేసుకుంది.

ఆ రోజు సాయంత్రం నుంచే అరుణకు టెన్షన్ మొదలయింది.

ముందు ప్రకాశంతో చెప్పి వొప్పించాలి?

అసలు చెప్పకుండా మీటింగుకు వెళ్ళి తర్వాత అతనితో తగాదా పడాలా? -

ఏదీ తేలలేదు.

అరుణకు హఠాత్తుగా తన చిన్నప్పటి సంగతి గుర్తొచ్చింది.

అరుణ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా దేవదాసు సినిమా వొచ్చింది. క్లాసులో అరుణ స్నేహితులందరూ ఆ సినిమాకు వెళదామనుకున్నారు. అప్పుడే పరీక్షలు జరిగి సంక్రాంతి శలవలు మొదలవుతున్నాయి. ఆఖరి పరీక్షరాసి దేవదాసు సినిమా చూడాలని చాలామంది వుత్సాహ పడ్డారు.

కొందరిళ్ళల్లో చెప్పి పర్మిషన్ సంపాదించారు. కొందరు చెప్పకుండా రావటానికి సిద్ధపడ్డారు. అరుణకు యింట్లో వొప్పుకోరని ఖచ్చితంగా తెలుసు. అరుణ యింట్లో వాళ్ళందరూ కలిసి యే సినిమా చూడవచ్చని తీర్మానిస్తారో ఆ సినిమానే చూడాలి.

అదీ యింట్లో వాళ్ళతో కలిసి మాత్రమే చూడాలి.

దేవదాసు సినిమాకు స్నేహితులతో కలిసి వెళతానంటే యింటిల్లిపాదీ అరుణకు అడ్డం నించుంటారు. అడిగితే బతిమాలితే వొప్పుకునే సమస్యేలేదు.

చెప్పకుండా వెళితేనో అని మొదటిసారి ఆలోచించింది అరుణ. పరీక్షరాసి యింటికొచ్చేసరికి రోజూ వొంటిగంటవుతోంది. ఆరుగంటలదాకా యింటికిరాకుండా యేంకారణం చెప్పాలో అరుణకు అంతుబట్టలేదు. ఏ కారణమూ ఆలోచించకుండానే స్నేహితులతో కలిసి సినిమాకు వెళ్ళిపోయింది. సినిమా చూస్తున్నంతసేపూ వొక్క క్షణం కూడా మనసు ప్రశాంతంగాలేదు.

'ఇంటికెళ్ళాక.... ఇంటికెళ్ళాక ఏం జరుగుతుంది?'

ఇదే ప్రశ్న పెనుపాములా మెదడంతా తిరిగింది. సినిమా సరిగా బుర్రకెక్కటంలేదు. అయినా స్నేహితులు వెక్కిరిస్తారేమోననే భయంతో చివరిదాకా కూచుంది.

ఇంటికి వచ్చాక అత్త నిలదీసి అడిగితే నిజంచెప్పేసింది. ఇక పెద్ద పంచాయితీ జరిగింది. అరుణ చెంపలు వాచిపోయేలా కొట్టాడు తండ్రి.

అదంతా గుర్తొచ్చింది అరుణకు. ఆరోజు సినిమాకు వెళ్ళటానికి యెంత టెన్షన్ పడిందో యివాళ మీటింగుకు వెళ్ళటానికి అంత టెన్షన్ పడాల్సివస్తోంది. అప్పుడు తనకు పదహారేళ్ళు. మైనారిటీ వెళ్ళలేదు. పెద్దలవెనక నిలబడటం తప్ప మరేం తెలియదు.

ఇప్పుడు తనకు పాతికేళ్ళు దాటాయి. రెండుసార్లు ఓటేసింది. మూడేళ్ళ పిల్లకు తల్లి. బాధ్యత గలిగిన లెక్చరరు. సంపాదనాపరురాలు.

అయినాసరే మీటింగుకు వెళ్ళాలి అనే నిర్ణయం తనంతట తను తీసుకోలేక పోతోంది.

తన గార్డియన్‌కు కోపం వస్తుందేమోనని భయపడుతోంది.

ఇంట్లో విషయాలకి సంబంధించి తనకీ బెరుకులేదు. కానీ బైటి విషయాలొచ్చే సరికి ప్రకాశం తనని కంట్రోలు చేయ్యాలని చూస్తున్నాడు. ఏదోరకంగా తానా కంట్రోలుని ఆమోదించాల్సిన పరిస్థితి వస్తోంది.

అరుణ బుర్ర వేడెక్కిపోయింది.

ఏమిటీ ఆలోచనలు?

ప్రకాశంతో మంచిగా విషయం చెబుతాను.

అతన్ని వొప్పిస్తాను.

భార్యాభర్తలు వొకర్నొకరు వొప్పించుకోవటం, రాజీపడటం, వొకరికి నచ్చనిపనులు యింకోరు మానెయ్యటం యివన్నీ తప్పు.

నిజంగా ప్రకాశానికి మీటింగుకి వెళ్ళటం యిష్టం లేకపోతే తాను మానేస్తుంది.

ప్రకాశం కంటే అతని ప్రేమకంటే ఎక్కువా యీ విషయాలు.

అయినా తాను అడగాల్సిన పద్ధతిలో అడిగితే ప్రకాశం కాదనడు. తనకెంతో యిష్టమని చెబితే వొద్దనడు.

అరుణ వేడంతా దిగిపోయేలా తలారా చన్నీళ్ళ స్నానం చేసింది. తెల్లటి మెత్తటి చీర కట్టుకుని ప్రత్యేకంగా ముస్తాబయింది.

లోపలెక్కడో 'ఏంచేస్తున్నావు నువ్వు' అనే ప్రశ్న గోల చేస్తుంటే అణిచేసింది.

ప్రకాశాన్ని నవ్విస్తూ కవ్విస్తూ అన్నం తినిపించింది. ప్రకాశం కౌగిలిలో కరిగిపోయింది. చాలా రోజుల తర్వాత అరుణ అంత ఉత్సాహంగా ఆనందంగా వుండటం చూసి ప్రకాశం సంతోషించాడు.

ఇద్దరూ తరగని కబుర్లన్నీ చెప్పుకున్నారు. ప్రేమికులుగా వున్న రోజులు గుర్తుకు తెచ్చుకున్నారు. పాపని చూసి మురిసిపోయారు. భవిష్యత్తు గురించి ఆలోచించారు.

ఇక అలసి నిద్రపోబోయే సమయంలో అరుణ మెల్లగా అంది.

"రేపు నువ్వు ఆఫీసునుంచి త్వరగా రావాలి"

"ఎందుకో! ఏం ప్రోగ్రాం వేశావోయ్" ఇంకా ఇంకా అరుణను దగ్గరకు లాక్కున్నాడు.

"ప్రోగ్రాం నాకే. నీకు కాదు. నువ్వింటి కొచ్చి పాపను చూడాలి. నేను ఆలస్యంగా

వస్తాను."

"నన్నొదిలి ఒక్కదానివే ఎక్కడికోయ్" గారం చేశాడు.

"మీటింగుకి"

"మీటింగా?"

"ఊ! - అదే ఆ పత్రిక లేదూ- వెలుగు! దానికి సంబంధించి. అందులో ఇంకా ఏ ఏ విషయాలు రావాలీ, ఇలాంటివి మాట్లాడటానికి ఒక మీటింగ్ పెట్టారు. నన్నుకూడా పిలిచారు. నేను వెళ్తాను."

ప్రకాశం మెడకింద మొహం దాచుకుంటూ చిన్నపిల్లలా చెప్పింది అరుణ.

ప్రకాశం వెల్లకిలా తిరగటంతో అరుణ ముఖం పక్కమీద ఆనింది.

"నీకింకా ఆ పత్రిక పిచ్చి వదల్లేదా అరుణా"

చాలా అసంతృప్తి ధ్వనించింది ప్రకాశం గొంతులో.

"పిచ్చేమిటి?"

"కాకమరేమిటి? ఎవరో ఏదో పనిలేని వాళ్ళు పత్రిక పెడితే నెలకు వంద చందా ఇస్తున్నావు. పోన్లే అనుకుంటే ఇప్పుడీ మీటింగులు"

"మీటింగులకి వెళితే ఏమవుతుంది?"

"వెళ్ళకపోతే ఏమవుతుంది?" పంతంగా అడిగాడు.

"నాకు చాలా అసంతృప్తిగా వుంటుంది. తెలుసుకోవాల్సినదేదో తెలుసుకోలేక పోయినందుకు బాధగా వుంటుంది. నాకు ఇష్టమై కూడా మీటింగుకు వెళ్ళలేని నా పరిస్తితి మీద చాలా అసహ్యం" చాలా స్పష్టంగా తన మనసుని అర్థం చేసుకోటానికి తానే ప్రయత్నిస్తున్నట్టు చెప్పింది.

"నీకు నేనేం చెప్పనూ? నాకయితే ఇష్టంలేదు. నాకు ఇష్టం లేకపోయినా సరే నీకిష్టమున్నపని చెయ్యకపోతే నీ ఆత్మగౌరవం దెబ్బతింటుంది. నువ్వెలాగూ ఆ పని చేస్తావు. ఎందుకు మన జీవితం ఇలాగవుతోంది? -"

"నేను మీటింగుకెళ్ళటం నీకెందుకిష్టం లేదూ?"

"వాటన్నిటితో మన జీవితం అశాంతిమయం అయిపోతుంది అరుణా. నాకు సంబంధం లేని ఏవేవో విషయాలు నీ జీవితంలోకి రావటం నాకిష్టంలేదు. నువ్వూ నేనూ, మన పిల్లలు- మన ఇల్లు. ఏ లోటూ లేని జీవితం. ఇవన్నీ నాకు కావాలి. నా కోసం పిల్లల కోసం నువ్వు. నీ కోసం నేను. అంతేగానీ నాకు తెలియని - నాకు సంబంధంలేని జీవితం నీకుండటం నాకిష్టంలేదు. అలాగే నీకు సంబంధంలేని జీవితం

నాకూ వుండదు. అరుణా. నామాటవిను. ఆ మీటింగులూ అవన్నీ పెట్టుకోకు" బతిమాలుతున్నట్లు అన్నాడు ప్రకాశం.

"పోనీ నువ్వు రావచ్చుగా. అపుడది నీకు సంబంధంలేని విషయమవదుగా"

"నువ్వు వెళ్ళటమే నాకిష్టంలేదు. నేనెందుకు వస్తాను? ఈ ప్రపంచంలో లక్ష అన్యాయాలు జరుగుతున్నాయి. నేనూ ఒప్పుకుంటాను. కానీ ఆ అన్యాయాలకు నేను బాధ్యుడ్ని కాను. వాటి విషయం నాకక్కరలేదు. అవన్నీ పట్టించుకుని నా జీవితం పాడుచేసుకోను. నాకు శాంతిగా బతకటం ఇష్టం."

అరుణేమీ మాట్లాడలేదు.

"ఈ మీటింగు కోసమా ఇవాళింత ప్రేమగా వున్నావు?" నిరసనగా అన్నాడు ప్రకాశం.

అరుణ ఉలిక్కిపడింది.

ప్రకాశం అటు తిరిగి పడుకున్నాడు.

హఠాత్తుగా అక్కడనించి మాయం అయిపోవాలనిపించింది అరుణకు.

నిజం కదూ- ప్రకాశాన్ని బాగా సంతోషపెట్టి ఆ విషయంలో ఒప్పించాలనుకుంది. ఎందుకా పని చేసింది? ఇదంతా ముందే సూటిగా ప్రకాశంతో మాట్లాడితే ఏమయ్యేది? ఎంత అజ్ఞానంగా ప్రవర్తించింది? ఎంత అవమానం? ప్రకాశం చివరకు ఆమాట అననే అనేశాడు. కానీ ఈ ప్రకాశమే ఒక రోజు తనతో ఏం మాట్లాడాడు? తనని సంతోషపెడుతూ ఒప్పించుకోవాలనలేదూ? ఆ రోజు ఆ మాటకి తనకు అసహ్యం వేసింది. ఐనా అందులో తప్పేముందిలే- భార్యా భర్తలు ఒకరి నొకరు ఒప్పించుకోవటం నేరం కాదే అని తనను తాను సమాధానపరుచుకుంది. ఇవాళ అతన్ని సంతోషపెడితే ఇంత అవమానం జరిగింది.

ఏం చెయ్యాలి తను?

ఎట్లా ప్రవర్తించాలి?

ఎట్లా ప్రవర్తించినా తనదే తప్పయిపోతుంది. అసలు తన ఆలోచనలోనే ఎక్కడో పొరపాటుంది.

ప్రకాశం ఏమన్నాడు? ప్రకాశానికి సంబంధంలేని జీవితం తనకుండకూడదట.

ప్రకాశంతో సంబంధంలేని జీవితం తనకు కావాలా వొద్దా?

ప్రకాశం తనకు కావాలి.

కానీ తనకు మిగిలిన విషయాలు కూడా కావాలి.

ప్రకాశానికిష్టం లేకపోతే ఆతను సంబంధం పెట్టుకోడు.

తన జీవితం మొత్తం అతనిదేనా? తన జీవితం తనది కాదా? ఇదీ తేల్చుకోవాల్సిన ప్రశ్న.

తన జీవితంలో ప్రతీదీ ప్రకాశంతో ముడిపడి వుండాలా? తనకు వేరే జీవితం వుండకూడదా?

ఆ జీవితాన్ని ప్రకాశం తెలుసుకోవచ్చు. పంచుకోవచ్చు. ప్రోత్సహించవచ్చు. కానీ అణిచెయ్యటానికి అతనికేం అధికారం వుంది?

కన్న తల్లిదండ్రులకు ఆ అవకాశం ఇవ్వని తను ప్రకాశానికి యెందుకివ్వాలి? ఇచ్చిందంటే తాను మళ్ళీ పంజరంలో పక్షే. తను కోరుకున్న స్వేచ్ఛ తనకు లేనట్లే.

కొలిమిలా మండుతున్న తలను రెండు చేతులతోనూ పట్టుకుని దిండులో తల దూర్చింది అరుణ.